# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## భక్తుల పాదరక్షలకు మరింత భద్రత

### -టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవారి దర్శనానికి కొండకు వస్తున్న భక్తులు తమ తమ పాదరక్షలను ఎక్కడబడితే అక్కడ వదలకుండా, నిర్దేశిత కౌంటర్లలోనే డిపాజిట్ చేయాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి విజ్ఞప్తి చేశారు. భద్రపరిచే కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధునిక వ్యవస్థ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2 వద్ద పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ విధానం అద్భుత ఫలితాలు ఇవ్వడంతో తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఎనిమిది కౌంటర్లను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు.

## తిరుపతికి "గ్రేటర్ హోదా"

# భారమేనా!?

### నగరపాలక కౌన్సిల్ ఆమోదించినా డీలిమిటేషన్‌కు బ్రేక్!!

### -10లక్షలమంది జనాభా సమకూర్చడం సమస్య



ప్రభాతవార్త–తిరుపతి:
జనాభా పెరుగుదలతో బాటు కొత్తగా ఏర్పాటవుతున్న కాలనీలతో రోజురోజుకూ విస్తరిస్తున్న తిరుపతి నగరం అంతర్జాతీయ స్థాయిలో బహుళ అంతస్థుల భవనాలు, కార్పొరేట్ కార్యాలయాలు రూపుదిద్దుకుంటున్నా "గ్రేటర్ తిరుపతి హోదా"స్థాయికి చేరడంలో వెనుకడుగువేయాల్సి వస్తోంది. 10లక్షల జనాభాతో మహానగరం విస్తరణ ఉండాలని ప్రతిపాదించారు. ఇప్పటికే మూడునెలల క్రిందట తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో కూడా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించిన విషయం కూడా తెలిసిందే. అయితే ఈ ప్రతిపాదనలు రూపుదాల్చకుండా తొలిప్రధాన కారణంగా కేంద్రప్రభుత్వం డీలిమిటేషన్‌కు అంగీకరించకపోవడమేననేది అధికారుల వాదనలు. జనగణన కారణంగా గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు ఇప్పటికిప్పుడు ప్రకటించే అవకాశం లేదనేది స్వయంగారాష్ట్రమంత్రి డాక్టర్ నారాయణ కూడా ఇటీవల వెల్లడించారు. తాత్కాలికంగా వాయిదా పడటంతో తిరుపతివాసుల్లో మహానగరం మాట వినిపించే అవకాశం లేదు. యాత్రాస్థలంగా, పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిచెందిన తిరుపతి నగరాన్ని మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి నుండి గ్రేటర్‌తిరుపతిగా విస్తరించేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. తిరుపతి నగరంలోని 50 డివిజన్లతోబాటు పరిసరాల్లోని పంచాయతీలు, శ్రీకాళహస్తి,చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు నాలుగు మండలాలు 63పంచాయతీలను గ్రేటర్‌తిరుపతిలో విలీనం చేసేందుకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ గత అక్టోబర్‌లోనే ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రస్తుతం తిరుపతి నగరపాలక జనాభా 4,52,004మంది ఉండగా అదనంగా కలిసే మండలాల జనాభా2,97,545మందితో 7.50లక్షలమంది జనాభాతో గ్రేటర్ తిరుపతి ఏర్పాటుకానుంది. రేణిగుంట మండలంలోని ఎలమండ్యం, జీపాళెం, కరకంబాడి,రేణిగుంట, వెంకటాపురం, కొత్రమంగళం, తండ్లం, విప్పమానుపట్టెడ,సూరప్పకశం, తూకివాకం, గాజులమండ్యం, గరుడరాజుపల్లి, వెదళ్ళచెరువు,చంద్రగిరిమండలంలోని చంద్రగిరి, తొండవాడ, శానంబట్ల, మిట్టపాళెం, నరసింగాపురం, రెడ్డివారిపల్లి, రామిరెడ్డిపల్లి, కొటాల, ఐతేపల్లి, అగరాల, తిరుపతి రూరల్‌మండలంలోని కెసిపేట, దుర్గసముద్రం, అవిలాల, సాయినగర్, లింగేశ్వరనగర్, వేదాంతపురం, తనపల్లి,నల్లమానికాల్వ, చెర్లోపల్లి, తిరుచానూరు, యోగిమల్లవరం, దామినేడు, పాడిపేట, పైడిపల్లి, గొల్లపల్లి, పేరూరు. తుమ్మలగుంట, మంగళం, చిగురువాడ, రామానుజపల్లి, మల్లంగుంట, పాతకాల్వ,సి.మల్లవరం, కాలూరు, వికృతమాల పరిసర ప్రాంతాల గ్రామాలు గ్రేటర్‌తిరుపతిలోకి రానున్నాయి. ఇందుకు ఆయా పంచాయతీలు కూడా అనుమతితో అంగీకరించడం విశేషం. అయితే కేంద్రప్రభుత్వం నుండి అనుమతి లేకపోవడంతో తాత్కాలిక వాయిదా తిరుపతిప్రజలను నిరుత్సాహ పరిచింది.

## నారావారిపల్లెలో

# సంక్రాంతి సంబరాలు

### ముఖ్యమంత్రి దంపతుల ఆనందం

### క్రీడాకారులతో చంద్రబాబు, బాలకృష్ణ మనువళ్ళు హుషారు



చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరీ దంపతులు సంక్రాంతి సంబరాలను ఆనందంతో తిలకించారు. ముఖ్యమంత్రి సొంతూరు నారావారిపల్లెలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్ రేస్, లెమన్ అండ్ బెలూన్ రన్ వంటి క్రీడలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మ్యూజిక్ చైర్స్‌లో బాలకృష్ణ మనువళ్ళు, గన్నీబ్యాగ్, లెమన్ స్పూన్ పోటీలలో చంద్రబాబు మనవడు దేవాన్ష్ సైతం హుషారుగా పాలు పంచుకోవడంతో సర్వత్రా సంబరాలు ఆకట్టుకున్నాయి. చంద్రబాబు, భువనేశ్వరి, లోకేష్, బ్రాహ్మిణి, నందమూరి వసుంధర, తేజస్విని, భరత్, ఎంఎల్‌ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి, శ్రీకాళహస్తి ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్ రెడ్డి సంక్రాంతి సంబరాలను ఆసక్తిగా తిలకించారు. అంతకు ముందు టిటిడి కళ్యాణ మండపం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలను తిలకించారు. క్రీడలలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన క్రీడాకారులను ముఖ్యమంత్రి దంపతు లు అభినందించి బహుమతులను ప్రధానం చేశారు. క్రీడాకారులందరితో ఫోటోలు దిగి వారిలో ఆనందాన్ని నింపారు. క్రీడలను విజయ వంతంగా నిర్వహించిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులకు సంక్రాంతి బహుమతులు అందజేసి అభినందించారు.

## కళ్యాణీడ్యామ్‌కు నీవా నీరు

### రూ.కోట్లాది నిధులతో స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధి

### సంక్రాంతికి ముఖ్యమంత్రి చంద్రబాబు విశేష కానుకలు



చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:
రైతన్న కళ్ళలో ఆనందం నింపుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సంక్రాంతి పండుగను సొంతూరు జరుపుకునేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం సంక్రాంతి సంబరాలను కుటుంబ సభ్యులతో కలసి తిలకించారు. మధ్యాహ్నం నుండి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో ఈ సంక్రాంతికి విశేష కానుకలతో ప్రజల మనస్సుల్లో ఆనందోత్సాహాలను నింపారు. ఇందులో భాగంగా నీవా బ్రాంచ్ కెనాల్ నుండి కళ్యాణీ డ్యామ్‌కు నీటిని తరలించేందుకు రూ.126.06 కోట్లతో మూలపల్లి చెరువు, కంటిమడుగు చెరువు, వెంకట్రాయుని చెరువు, నాగపట్ల చెరువులను అనుసంధానిస్తూ చేపట్టే పనులకు శంకుస్థాపన గావించారు. అదేవిధంగా విద్యుత్ అంతరాయలను అధిగమించేందుకు నారావారిపల్లిలో రూ.4.27 కోట్లతో నిర్మించిన 33/11 కెవి సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని ప్రతి కుటుంబంలో ఒక ప్రారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దాలనే సంకల్పంతో రూ.1.4 కోట్లతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ భవనాన్ని ప్రారంభించారు. నారావారిపల్లెలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సంజీవని ప్రాజెక్టును జిల్లా వ్యాప్తంగా అందించేందుకు పథకాన్ని విస్తరిస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ సంజీవనీ గురించి ముఖ్యమంత్రికి వివరించారు. అదేవిధంగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన పశువుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేశారు. తిరుపతి రుయా ఆసుపత్రి ఆవరణలో దివంగత కూరపాటి రామచంద్రనాయుడు, దివంగత సుశీలమ్మ జ్ఞాపకార్థం రూ.45 లక్షలతో నిర్మించిన పేషెంట్ అటెడెంట్ అమీనిటీస్ కాంప్లెక్స్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం మిల్లెట్ టిఫిన్స్, ఫుడ్ బాస్కెట్ ప్రోగ్రామ్, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ పులివర్తి నాని, తిరుపతి ఎంఎల్‌ఏ జంగాలపల్లి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిచే ఎస్వీయూ భవనాలు ప్రారంభం



తిరుపతి విద్య,జనవరి 13 ప్రభాత వార్త
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని రూసా నిధులతో నిర్మించిన సుమారు 27 కోట్ల రూపాయల విలువైన నూతన భవనాలను, వివిధ నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం మధ్యాహ్నం నారావారి పల్లెలో శిలాఫలకాలను ఆవిష్కరించి, ప్రారంభించారు.మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 291 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణం,503 లక్షల వ్యయంతో నిర్మించిన అకడమిక్ రెండవ ఫ్లోర్,600 లక్షల వ్యయంతో నిర్మించిన కేంద్రీకృత పరిశోధన అత్యాధునిక ల్యాబొరేటరీ, 500 లక్షల వ్యయంతో నిర్మించిన 50 గదుల విద్యార్థినుల హాస్టల్ నిర్మాణం,787 లక్షల వ్యయంతో 60 గదులతో , 238 విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో నిర్మించిన బాలుర వసతి గృహం, వివిధ విభాగాల్లో విద్యార్థులకు టాయిలెట్స్ శిలాఫలకాలను ఆవిష్కరించారు.ముఖ్యమంత్రి చదువుకున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్న తీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పాల్గొన్నారు. ఇంజనీర్ తాండవకృష్ణ, పరిపాలన బృందం పాల్గొన్నారు.

## భోగభాగ్యాలు కలిగించే "భోగి"

### తిరుపతిలో వేకువజామున ఉత్సాహంగా భోగిమంటలు



తిరుపతి,జనవరి 13ప్రభాతవార్త:
ఆధ్యాత్మికనగరం తిరుపతిలో మంగళవారం అర్ధరాత్రి సాంప్రదాయమైన భోగిపండుగను రాయలసీమ రంగస్థలం కళాకారులు, పెద్దకాపులేఔట్ యువత కేరింతలుగా జరుపుకున్నారు. బుధవారం వేకువజామున 2గంటలకు తాతానగర్ కూడలిలో ,రాయలసీమ రంగస్థలం కార్యాలయం వద్ద ఎండు కర్రలు, చెత్త,పనికిరాని వస్తువులను కలిపి భోగిమంటలు వేశారు. వణికిస్తున్న చలిలో భోగిమంటలు ఉత్సాహం కలిగించాయి. భోగిపండుగ ను ప్రజలు భోగభాగ్యాలతో, సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ కలియుగదైవం తిరుమల శీవారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ,రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి ,రుద్రకోటి సదాశివం ,కరాటే శీను ,ప్రభాకర్ నాయుడు ,రాజశేఖర్ రెడ్డి ,బాబు , మురళి, ముని కృష్ణయ్య , శ్రీధర్, ,మల్లారపు రవి ప్రసాద్ , రమేష్ ,పురోహితుడు సురేష్ స్వామి,మల్లారపు వాసు, తదితరులు పాల్గొన్నారు.

## జల్లికట్లు, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

### - చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి వార్నింగ్



చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:
జిల్లాలో ఎక్కడైనా జల్లికట్లు, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. కోడి పందేలు, జల్లికట్టు వంటి కార్యక్రమాలు చట్ట విరుద్ధమైనవని, మూగ జీవాలపై హింసకు కారణమవుతాయన్నారు. కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగాలు, పాస్‌పోర్టు రావడం కష్టమవుతుందని, యువత తన భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. అలాగే పాత నేరస్తులపై ఇప్పటికే నిఘా వుంచడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే అరెస్టులు తప్పవని స్పష్టం చేశారు. కోడి పందేలను కట్టడి చేయడానికి రెవెన్యూ, జంతు సంక్షేమశాఖ, ఇతర సంబంధిత విభాగాలను సమన్వయం చేసుకుని పోలీసులు పని చేయాలన్నారు. మండల స్థాయిలో తహసిల్దారు, ఎస్ఐ, జంతు సంక్షేమ సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో నిఘా కొనసాగించాలని ఆదేశించారు. గ్రామ

## కోడిపందాలు, జూదం సంపూర్ణ నిషేధం

### తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి,జనవరి 13ప్రభాతవార్త:
తిరుపతి జిల్లాలో కోడి పందాలు, జూదం వంటి చట్ట వ్యతిరేక క్రీడలపై సంపూర్ణ నిషేధం ఉన్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. సంప్రదాయ ముసుగులో జీవహింసకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. పండుగ ముసుగులో కోడిపందాలు, జూదం నిర్వహించినా ,వాటికిస్థలాలు పోలాలుకల్పించినా నిర్వాహకులు, పాల్గొన్నవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రోన్ కెమెరాలు, సిసికెమెరాలు ,ప్రత్యేక పోలీసుల బృందం సహాయంతో జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుపతి జిల్లాలో కోడి పందాలు,పేకాట,మట్కా జూద క్రీడలు నిర్వహించడం, చట్టరీత్యా నేరమని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.సంక్రాంతి పండుగ నేపథ్యంలో సంప్రదాయ క్రీడలతో ప్రజలు, యువత ఆనందోత్సాహాలతో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పారదర్శకంగా జనగణనకు ప్రత్యేక ప్రణాళికలు

### - ఇన్‌ఛార్జ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్‌కు వివరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:
జిల్లాలో జనగణన పక్కాగా నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్‌కు వివరించారు. అమరావతి నుండి ఇన్‌ఛార్జ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ జనగణన కార్యక్రమాల అమలుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ సర్వేకు ప్రజలందరు సహకరించాలని, ఆరు నెలల నుండి ఏడాది పాటు జరిగే ఈ ప్రక్రియకు కాగిత రహితంగా డిజిటలల్ యాప్ ద్వారా జనగణన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆయనతో మాట్లాడుతూ జిల్లాలో ముఖ్య జనాభా లెక్కల అధికారిగా కలెక్టర్‌గా తాను వ్యవహరిస్తున్నాని, అదనపు జనాభా లెక్కల అధికారిగా జెసి వ్యవహరిస్తున్నారని, జిల్లా జనాభా లెక్కడ అధికారిగా జిల్లా రెవెన్యూఅధికారిని నియమించడం జరిగిందన్నారు. అలాగే సిపిఓ, డిఇఓ, జడ్పీ సిఇఓ, సర్వే శాఖ ఎడి, డిపిఓ, డిఎఫ్ఓలు జిల్లా అదనపు జనాభా లెక్కల అధికారులుగా నియమించడం జరిగిందన్నారు.సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కరుణ కుమారి, సెక్షన్ సూపరిటెండెంట్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

# బాధలు అగ్నికి ఆహుతి ఇచ్చేదే 'భోగిపండుగ'

(తొట్టంబేడు, ప్రభాతవార్త)
ప్రతి సంవత్సరం ఆంగ్లనెల ప్రకారం జనవరినెలలోను, తెలుగునెలల ప్రకారం పుష్యమాసంలోను శ్రద్ధతో ఆచరించే పెద్దల పండుగగా పేరొందిన పెద్దపండగే మకరసంక్రాంతి. దక్షిణాయనానికి ఆఖరిరోజు, ధనుర్మాసానికి ఆఖరిరోజు, మకరసంక్రాంతికి ముందు రోజు భోగి పండుగ. సాధారణంగా భోగి అంటే తొలిరోజు అని అర్థం. పెద్దపండుగగా పిలువబడే మూడు రోజుల సంబరాలు సంక్రాంతికి తొలిరోజును భోగిగా పిలుస్తారు. దక్షిణాయంలో ప్రజలు తాము పడిన కష్టాలను, భాదలను అగ్ని దేవుడికి ఆహుతి చేస్తు రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలే 'భోగిమంటలు'. భోగి రోజు సాయంత్రం పిల్లలకు పోసే భోగి పళ్ళ సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఆశీస్సులుగా పేర్కొంటారు. ఈపండుగనాడు సంక్రాంతి సంబరమంతా పిల్లలదే. తెల్లవారు జామునే లేని భోగిమంటలు వేయడం, సాయంత్రం భోగి పండ్లు పోయించుకోవడంతో హుషారుగా ఉంటారు. 'భగ' అగ్ని పదం

### -నేడు భోగి



నుంచి 'భోగి' అన్న మాట పుట్టిందని చెబుతారు. భగ అంటే మంటలు లేదా వేడిని పుట్టించడం అని అర్థం. రేగిపండ్లను సంస్కృతంలో 'బదరీఫలం' అంటారు. తమ పిల్లలకు భోగిపళ్లలో చేమంతి, బంతి పూలరేకులు, అక్షింతలు, చిల్లరనాణేలు, పాలకాయలు కలిపి చిన్నారుల తలపై పోస్తారు. సాధారణంగా భోగి అంటే సూర్యుణ్ణి అరాధించే అతిపెద్ద ఉత్సవం. సంక్రాంతి పండుగ వచ్చిందంటే తెలుగు లోగిళ్లన్నీ కళకళ లాడుతుంటాయి. కొత్తపంటలు ఇంటికి రావడం, అల్లుళ్ల కూతుళ్ల, మనుమలు.. ఇలా ఇంటి నిండా ఆత్మీయులు ,సన్నిహితులతో ఇళ్లు ఆనందోత్సాహాలతో నిండి ఉంటుంది. ఎంతో కష్టపడి నేలతల్లిని నమ్ముకున్న రైతులు వేసిన పంటలు చేతికొచ్చిన తరుణం. తాము వేసిన పంటలు చేతికి వచ్చిన తర్వాత కుటుంబసభ్యులతో ఎంతో సంతోషంగా గ్రామాల్లో అన్నదాతలు పండుగనుజరుపుకుంటారు. పంటలు కుప్పలమార్పిడి అవగానే మిగిలిన పధార్థాలను మంటగా వేయడం వల్ల పుష్యమాస లక్షణమైన చలి తగ్గి వాతావరణం కొంచెం వేడెక్కుతుంది.

### భోగి వెలిగించిన ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలసి భోగి మంటలను వెలిగించారు.మార్కెటింగ్ కమిటి ఆవరణలో ఆయన భోగి మంటలను వేసారు. తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పంటల్లేవు...పథకాల్లేవు ఇంకెక్కడ పండుగ

### - మాజీ మంత్రి రోజా



పుత్తూరు(నగరి) జనవరి 13 ప్రభాతవార్త:
ఎరువులు, యూరియా అందక సబ్సిడీ విత్తనాలు లేక, పంటలు చేతికి రాక వచ్చినా గిట్టుబాటు ధరలేక ఇచ్చిన హామీలు ఏవీ అమలుకాక రైతుకు భవిష్యత్ అంధకారంగా కనిపిస్తోందని పంటల్లేవు...పథకాల్లేవు ఇంకెక్కడ పండుగ అనే స్థాయికి రైతులు చేరుకున్నారని,సంక్రాంతి కళ తప్పి కనిపిస్తోందని మాజీ మంత్రి రోజా అన్నారు. మంగళవారం తన నివాస కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అందరికి పార్టీ క్యాలెండర్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ రైతుకు ప్రధాన పండుగైన సంక్రాంతిని జరుపుకోవడానికి ఖర్చులకు లేక రైతే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. జగనన్న 80 శాతం పూర్తి చేసిన పనులను అటకెక్కించేసిందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపేశామని చెప్పేంత వరకు చంద్రబాబు కుట్ర బయటపడలేదన్నారు. పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, నగరి, పుత్తూరు ఎంపీపీలు భార్గవి, మునివేలు, నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధులు, పార్టీ కమిటీ నేతలు, అనుబంధ కమిటీ నేతలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వరసిద్దుని సేవలో సినీ దర్శకుడు రవీంద్రబాబి

కాణిపాకం, జనవరి 13 ప్రభాతవార్త:



సినీ దర్శకుడు రవీంద్రబాబి మంగళవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ అధికారులు,అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు.అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమం పడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

## శ్రీకోదండరామాలయంలో ఘనంగా గోదాదేవి కళ్యాణం

తవణంపల్లె, జనవరి 13 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండలో వెలసిన శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో మంగళవారం గోదాదేవి కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. బోగి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రతిఏటా గోదాదేవి కళ్యాణం నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఉదయం ఆలయంలో శ్రీసీతా లక్ష్మణ సమేత కోదండరాములు స్వాముల వారి మూలవిరాట్‌కు ఉదయం ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీగోదాదేవి, రంగనాథ స్వామివార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు పండితుల మంత్రోచార్చరణ నడుమ కళ్యాణోత్సవంను వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. గోదాదేవి కళ్యాణోత్సవంను తిలకించిన భక్తజనం పులకించి పోయారు.ఈకార్యక్రమంలో ఉత్సవ ఉభయదారులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జనవరి13 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడును ప్రభుత్వ విప్ డా॥కంచర్ల శ్రీకాంత్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంక్రాంతిప ండగకు సిఎం కుటుంబీకులు నారావారిపల్లికి చేరుకున్న విషయం విదితమే. దీంతో ప్రభుత్వ విప్ డా॥ శ్రీకాంత్ నారావారిపల్లిలో సిఎం చంద్రబాబును కలసి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ తాజా పరిస్థితులపై సిఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం డా॥ శ్రీకాంత్ సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరమ్మ, రాష్ట్రవిద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను సైతం మర్యాదపూర్వకంగా కలిశారు.

## కుప్పంలో వందేభారత్..ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త



కుప్పం మీదుగా వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కుప్పంలో ఒక నిమిషం స్టాపింగ్ కేటాయించాలని కోరుతూ సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు దక్షిణపశ్చిమ రైల్వే డిఆర్‌ఎం అశ్రోష్ కుమార్ సింగ్‌కు వినతిపత్రంఅందించారు. కుప్పం మీదుగా వెళ్లే మధురై, చెన్నై వందేభారత రైళ్లతో పాటు త్వరలో ప్రారంభం కానున్న బెంగళూరు - విజయవాడ వందేభారత్ రైలును కూడాకుప్పంలో నిలపాలని కోరారు. అలాగే పుష్‌పుల్ రైలును మల్లానూరు వరకు పొడిగించాలన్నారు.సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కావడంతో పాటు ఇక్కడకు పరిశ్రమలు, ఎయిర్‌పోర్టు వస్తున్న తరుణంలో అధికంగా ట్రైన్లను నిలపాలని కోరారు. దీనిపై డిఆర్‌ఎం స్పందించి రైళ్ల స్టాపింగ్‌కు తగు చర్యలు తీసుకుంటామనిహామీ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మజ, అరుణ, అనిత, పంచాక్షరి హరిబాబు పాల్గొన్నారు.

## తీరని లోకాలకు చేరిన తల్లి

- తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి !!

కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త

మండలంలోని గరిగచీనేపల్లికి చెందిన విమల (43) తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ చక్రపాణి తెలిపారు. సోమవారం విమల తన కుమార్తెను సంక్రాంతి పండగను చూసుకుని అత్తారింటికి వెళ్లమని పేర్కొనగాఅందుకు ఆమె కుమార్తె అంగీకరించకపోగా విమల ఒక్కసారిగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న విషయం విదితమే. కుప్పం పిఇఎస్‌నుంచి విమలను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. విమల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## నారా భువనమ్మను కలసిన దేశం నేతలు

కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త



సంక్రాంతి పండగకు నారావారిపల్లికి విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరమ్మను కుప్పంకు చెందిన పలువురు తెదేపా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, సర్పంచ్ సంతోష్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, నేతలు గిరిధర్, బాలు, మంజుపాల్గొన్నారు.

## అనధికార లేఔట్లపై కొరడా....



*పుంగనూరు, జనవరి 13 ప్రభాతవార్త* పట్టణంలో అక్రమంగా, పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అనధికార లేఔట్ల వ్యవహారాలపై అధికారులు కరుణాచల్పిస్తున్నారు.మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో మంగళవారం మున్సిపల్ సిబ్బందితో పట్టణంలోని పలు ప్రాంతాల్లో లేఅవుట్ల తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలను అప్పటికప్పుడే తొలగించడానికి వెంటనే చర్యలు తీసుకున్నారు. లేఅవుట్లు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి జగదీష్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వంచే అమలులో ఉన్న ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్రమ లేఅవుట్లకు ఈనెల జనవరి 23వ తేదీ చివరి గడువని తెలిపారు. మంగళవారం పట్టణంలో మూడు అనధికార లేఔట్ల రాళ్లను తొలగించారు. శుభారాం కాలేజీ వద్ద ఒకటి, యుఎన్ఆర్ సర్కిల్ వద్ద రెండు, గోకుల్ సర్కిల్ వద్ద ఉన్న ఒక లేఅవుట్‌ను తొలగించి హెచ్చరికలు జారీ చేశారు . గడువు ముగిసిన తరువాత కూడా అక్రమ లేఅవుట్లపై లావాదేవీలు జరిపితే, సంబంధిత వివరాలను సబ్ రిజిస్ట్రార్‌కు పంపించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# రైల్వే కోడూరు డివిజన్

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేత

ఓబులవారిపల్లి, జనవరి 13 ప్రభాతవార్త



ఓబులవారిపల్లి మండలంలో మొక్కవారిపల్లి పంచాయతీలో తమ నివాసంలో ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ లు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రతిరోజు ఏదో ఒక విధంగా సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు వారి వారి గ్రామాలకు వెళ్లి. చెక్కులను పంపిణీ చేశారు. మంగళవారం సంక్రాంతి పండుగ కారణం చేత ఇంటి వద్దకే వచ్చిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతినిత్యం ప్రజా సేవలో ప్రజాభివృద్ధికి కృషి చేస్తూ ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుఖ సంతోషాలతో పండుగను ప్రజలు జరుపుకోవాలి

రామిరెడ్డి ద్వజారెడ్డి



రైల్వే కోడూరు, జనవరి 13 ప్రభాతవార్త

రైల్వే కోడూరు మండల ప్రజలు విజయవంతంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని రైల్వేకో డూరు వైసిపి సీనియర్ నాయకులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వే కోడూరు మండలంలోని ప్రజలందరూ విజయవంతంగా సంక్రాంతి పండుగను ఎటువంటి అల్లర్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని , సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

యాదమరి, జనవరి 13 ప్రభాతవార్త:

యాదమరి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యం అయ్యింది. ఈ మేరకు యాదమరి మండలం వరదరాజులపల్లి పంచాయతీ కట్టకిందవూరు గ్రామంకు చెందిన బి.తులసీ(18) సోమవారం ఇంటి నుండి బయటికి వెళ్ళి అనంతరం తిరిగి రాలేదు. ఈ మేరకు బి.తులసీ తండ్రి డి.సుబ్రమణ్యంరెడ్డి మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బి.తులసీ బెంగళూరు నుండి 11వ తేదీ కట్టకిందవూరు గ్రామానికి వచ్చిందని, అనంతరం 12వ తేదీ ఉదయం 9.30 గంటలకు తాను బట్టలు కుట్టించుకోవడానికి టైలర్ వద్దకు వెళ్ళి వస్తానని చెప్పి బయటికి వెళ్ళిన తులసీ ఆపై ఇంటికి రాలేదని పోలీసులకు ఆమె తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బకాయిల చెల్లింపుల్లో ప్రభుత్వ తీరు ఆక్షేపణీయం

- వైఎస్ఆర్‌టిఎ ఆరోపణ



చిత్తూరుహెల్త్, జనవరి 13 ప్రభాతవార్త:

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపుల్లో కూటమి ప్రభుత్వ తీరు ఆక్షేపణీయంగా వుందని రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి వుంటే కేవలం రూ.1,100 కోట్లు విడుదల చేసి సంక్రాంతి కానుక అని గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటుగా వుందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన కొద్దిపాటి సొమ్ము సైతం పండుగ నాటికి చేతికి అందే అవకాశం లేదని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంక్రాంతి సంబరాలు లేవని కేవలం నిరాశ మాత్రమే మిగులుతుందని ఆవేదన చెందారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆయన విమర్శించారు. అలాగే పిఆర్‌సి ఛైర్మన్ నియమించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగావిఫలంఅయ్యిందని, ప్రభుత్వంవెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కోడి పందెలు చట్ట విరుద్ధం

- ఎక్కడైనా నిర్వహించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు

- జిల్లా పశుసంవర్ధకశాఖ జెడి ఉమామహేశ్వరీ



**చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:** కోడి పందెలు నిర్వహించడం చట్టవిరుద్ధమని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వరీ స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా కోడి పందెలు నిర్వహించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో అమలులో వున్న చట్టాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కోడి పందెలు నిర్వహించడాన్ని స్పష్టంగా నిషేధించిందన్నారు. జిల్లాలో ఈ నిషేధం పక్కాగా అమలులో వుంటుందని ఆమె ప్రజలకు స్పష్టం చేశారు. జంతు సంక్షేమ చట్టం-1960, సుప్రీకోర్టు, రాష్ట్ర హైకోర్టుల తీర్పుల ప్రకారం కోడి పందెలు జంతువులపై అమానుషత్వం, హింసకు దారి తీసే అక్రమ చర్యలుగా గుర్తించబడ్డాయన్నారు. కోడి పందెలు నిర్వహించడం, వాటిని ప్రోత్సహించడం, నిర్వహణకు సహకరించడం, కోళ్ళకు గాయాలు అయ్యేలా వాటికి కత్తులు కట్టడం వంటి చర్యలు నిషేధించబడ్డాయన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడి పందెలు నిర్వహించినట్లైతే లేదా నిర్వహించడానికి ప్రయత్నిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఎక్కడైనా అక్రమంగా కోడి పందెలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే సమీప పోలీస్ స్టేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని ఆమె కోరారు.

## వాలీబాల్ పోటీలు ప్రారంభం

బంగారుపాళ్యం, జనవరి 13 ప్రభాతవార్త:



స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠవాల క్రీడా మైదానంలో మంగళవారం సాయంత్రం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మండల తెలుగుదేశం గౌరవ అధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్, మాజీ సర్పంచ్ ఎంబి కృష్ణమూర్తిలు ప్రారంభించారు. ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో చిత్తూరు వాలీబాల్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు, నాల్గవ బహుమతిగా రూ.5 వేలు ప్రదానం చేయనున్నారు. జిల్లా నలుమూలల నుండి పలు వాలీబాల్ క్రీడా జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు నౌషాద్, కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, కోశాధికారి మురారి, ఆర్గనైజర్ రావూరి సురేష్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## కరెంటోళ్ళ జనబాట సద్వినియోగం



- ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్

పెనుమూరు, జనవరి 13 ప్రభాతవార్త:

గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి ట్రాన్స్‌కో నిర్వహిస్తున్న జనబాట కార్యక్రమంను ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడు సద్వినియోగం చేసుకొని వారి విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. ట్రాన్స్‌కో నిర్వహిస్తున్న జనబాట కార్యక్రమంలో మంగళవారం ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ మండలంలోని పులికల్లు గ్రామంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ మాట్లాడుతూ గ్రామాల్లో సుదీర్ఘకాలంగా పరిష్కరించడబడని విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందితో కలిసి జనబాట కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు, ప్రజలు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ గ్రామానికి లోఓల్టేజీ సమస్య వుందని ఫిర్యాదు చేయడంతో సత్వరం గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎఇ తులసీ ప్రసాద్‌ను ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. అలాగే గ్రామాల్లో మరమ్మత్తుకు గురైన విద్యుత్ స్తంభాలను సత్వరం మార్చడానికి చర్యలు తీసుకోవాలని ఎఇ తులసీ ప్రసాద్‌ను ఎస్ఇ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడిఇ శేషాద్రిరెడ్డి,ఎఇ తులసీ ప్రసాద్, ఎల్ఐ పద్మానాయుడు, ఎల్ఎం రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్..అగ్రి ప్రాడక్ట్ పరిశ్రమల ఏర్పాటుకు కృషి

- ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్



కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలో ఫుడ్, అగ్రి ప్రాడక్ట్ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎపిఐఐసి డైరెక్టర్ మల్లానూరు ప్రేమ్‌కుమార్ తెలిపారు. కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో నలభైఏళ్లుగా మద్యం తయారీ డిస్టలరీలో ప్రముఖంగా ఉన్న శశి డిస్టలరీస్ ఎండి తనేజ్‌ను బెంగళూరులో మర్యాదపూర్వకంగా కలిసినట్లుచెప్పారు. సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కుప్పానికి వివిధ రకాల పరిశ్రమలు వస్తున్నాయన్నారు.ఎపిలో పరిశ్రమలకు స్పీడ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలులో ఉందని వివరించామన్నారు. త్వరగా అనుమతులు లభించడంతో పాటు కుప్పం ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ మరియు అగ్రి ప్రాడక్ట్స్ యూనిట్లను ఏర్పాటుచేసేందుకు సహకరించాలని కోరినట్లు తెలిపారు.

## పండుగ వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

రైల్వే కోడూర్, జనవరి 13 ప్రభాతవార్త

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట మండలాలలో ఉన్న ప్రజలు అసాంఘిక కార్యక్రమాలను నిర్వహించే వారిపై ఉక్కు పాదం మోపుతామని రైల్వేకోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కోడి పందాలు, అసాంఘిక కార్యక్రమాలు చేపడితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. జిల్లా ఎస్పీ, ఏఎస్పి ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా ఇటువంటి కార్యక్రమాలపై ఆసక్తి చూపితే చర్యలు కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. సంక్రాంతి పండుగను కుటుంబ సమేతంగా ప్రశాంతంగా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆయన ప్రజలకు తెలియజేశారు.

## పుంగనూరులో హెల్మెట్ ధరించాలని అవగాహన బైక్ ర్యాలీ



పుంగనూరు రూరల్, జనవరి 13 ప్రభాతవార్త

పట్టణంలోని రోడ్డు భద్రత మాసఉత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్ సేఫ్టీపై హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నా క్యాంటీన్ నుంచి ముడేప్ప సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ అధికారి ఎంవీఐ సుప్రియ మాట్లాడుతూ, ఇటీవలి రోజుల్లో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బైక్‌పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల్లో తలకు గాయాలు తగలకుండా ప్రాణ రక్షణ సాధ్యమవుతుందరున్నారు.

## అయ్యప్ప ఆలయంలో కోయిల్ తిరుమంజనం

**పుంగనూరు రూరల్ జనవరి 13 ప్రభాతవార్త** అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మకర జ్యోతి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా హరి గురుస్వామి మాట్లాడుతూ బుధవారం ఉదయం అయ్యప్ప స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేరళ సంప్రదాయానికి అనుగుణంగా పడిమెట్ల పూజతో పాటు భక్తులకు జ్యోతి దర్శనం కల్పించనున్నట్లు వారు తెలిపారు. మకర సంక్రాంతి సందర్భంగా పట్టణ ప్రజలు భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహిళలు ఆర్థికశక్తిగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకారం

- ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి



**పెద్దపంజాణి, జనవరి 13 ప్రభాతవార్త** మహిళలు ఆర్థికశక్తిగా ఎదిగేందుకు సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోనికూటమి ప్రభుత్వం తగు సహకారంఅందిస్తోందని దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి కోరారు. మంగళవారంమండలంలోని రాయలపేటలో ఆయన పర్యటించి లబ్దిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పంచాయతీలకు చెత్తసేకరణ బళ్లను ప్రారంభించారు. అనంతరంఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబాలుబాగు పడతాయన్నారు. సిఎం చంద్రబాబు ద్వాక్రా సంఘాలు స్థాపించారని నేడు మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలని చొరవ చూపుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థి క ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో పెట్టుబడిదారులు రాష్ట్ర ఒనుంచి పారిపోయారన్నారు. నేడు సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పెట్టుబడుల కోసం శ్రమిస్తున్నారన్నారు. రాయలపేట పరిసర ప్రాంతాలకు కృష్ణాజలాలు తెచ్చేందుకు సిఎంతో చర్చించినట్లు చెప్పారు. త్వరలో కార్యరూపం దాల్చేలా చూస్తామన్నారు. అవకాశం ఉంటే రాయలపేటను మండల కేంద్రంగా చేసుకుందామన్నారు. స్థిరమైన ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం వద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలు

పలమనేరు, జనవరి 13 ప్రభాతవార్త:



ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పలమనేరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే పండుగ సందర్భంగా ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ సారి కూడా శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి గుడి చైర్మన్ మురళీక్రిష్ణ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ మహిళా కార్మికులు పట్టణంలోని ఇతర మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులతో ఆకుట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. ఈ నెల 14న భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగ జరుపుకుంటారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు సంక్రాంతి పండుగ రోజున ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారు.

## నేడు వేణుగోపాల స్వామి గుడిలో గోదాదేవి కల్యాణం

పలమనేరు, జనవరి 13, ప్రభాతవార్త:

పలమనేరులోని పాతపేటలో గల సంతాన వేణుగోపాల స్వామి గుడిలో ఈ నెల 14న భోగి పండుగ సందర్భంగా స్థానిక వేణుగోపాల స్వామిగుడిలో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోదాదేవి కల్యాణం చేయించినా వీక్షించినా ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లుతారని భక్తుల నమ్మకం. ఇందులో భాగంగా ఉదయం 10 గంటల నుండి కల్యాణ ఉత్సవాలు ప్రారంభిస్తారు, మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి కల్యాణం ఉంటుంది. చిన్నపిల్లలకు భోగిపళ్ళు పంచే కార్యక్రమం ఉంటుందని గృహస్తులు తమ పిల్లలను తప్పకుండా తీసుకు వచ్చి స్వామి అమ్మవార్ల ఆశీర్వాదాలు పొందాలని ఎటువంటి దోషాలు తగులకుండా చూడాలని నిర్వాహకులు తెలిపారు. అలాగే 10 ఏళ్ళు పైబడిన ఆడపిల్లలచే గొబ్బెమ్మలతో ఆటపాటలు ఉంటాయని, 10 ఏళ్ళు పైబడ్డ మగపిల్లలకు గాలిపటాలు ఉచితంగా పంపిణీ చేస్తామని, గాలి పటాలు ఎగుర వేసే కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

## కార్వేటినగరం వృద్దులకు వస్త్రదానం



కార్వేటినగరం, జనవరి 13 ప్రభాతవార్త:

కార్వేటినగరంలోని రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీఆశ్రమంలోని వృద్దులకు ఓ ట్రస్టు వస్త్రదానం చేశారు. పుత్తూరు పట్టణానికి చెందిన సంజీవ సింహాట్రస్టు చైర్మన్ డి.యన్.వెంకటేశులు జన్మదిన సంధర్బంగా వృద్దులకు చీరలు ,లుంగీ లు,తినుబండారాలు,పండ్లు,అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన కుటుంబసభ్యులు,స్నేహితులు చంద్రయ్య,సుమన్, వేణుగోపాల్, గాంధీ, సూపం`వైజర్ ప్రకాష్, వృద్దులు పాల్గొన్నారు.

## గ్రామదేవతకు ప్రత్యేకపూజలు

కార్వేటినగరం,జనవరి 13 ప్రభాతవార్త:



కార్వేటినగరం గ్రామదేవతయిన బంగారమ్మకు మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు.మంగళవారం ఉదయం అమ్మవారికి పాలు,పెరుగు, తేనే, పసుపు కుంకుం,నారికేళాలతో అభిషేకం నిర్వహించారు. పువ్వు లు,అభరణాలతో అమ్మవారిని అలంకరించారు.ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్, కమిటీసభ్యులు,అర్చకులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ఐటిఐ సిబ్బంది

కార్వేటినగరం,జనవరి 13 ప్రభాతవార్త:

కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని పలువురు వాపోతున్నారు. విధులకు ఉదయం ఆలస్యంగా రావడం,సాయంత్రం త్వరితగతిన వెళ్ళిపోవడం జరుగుతుందని అంటున్నారు.జిల్లాఅధికారులుస్పందించివిధులకుసక్రమంగా హాజరయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

## పొలాలకు వెళ్లే దారి ఏర్పాటు చేయాలని వినతి

రామకుప్పం,జనవరి 13 ప్రభాతవార్త:



:మండలంలోని బందార్లపల్లి పంచాయతీ లో ఇప్పుడు జరుగుతున్న భూమి రీ సర్వేలో వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులను ఏర్పాటు చేయాలని బిజెపి మండల అధ్యక్షురాలు రాణి జనార్దన్ రెడ్డి తహసిల్దార్ కౌలేష్ కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో బిజెపి నేతలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పొలాలకు వెళ్లేందుకు రహదారుల నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఎక్కువ శాతం రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దారులు లేక చాలా ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని వివరించారు. బందార్లపల్లి పంచాయతీలోని చెరువులకు హంద్రీనీవా జలాలు వచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## టిడిపి కార్యకర్త మృతికి ఘన నివాళి

రామకుప్పం,జనవరి 13 ప్రభాతవార్త:



మండల పరిధిలోని బల్ల పంచాయతీ కర్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త శ్రీనాథ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం బెంగళూరులో ని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ఆయన భౌతిక కాయానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబీకులైన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి ఇతరులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి, ఆనంద రెడ్డి, కార్యదర్శి కామ రాజు నాయక్, నేతలు రామ్మూర్తి ,గుర్రప్ప, వెంకట్రామ గౌడు, జయశంకర్, విశ్వనాథ్, మహమ్మద్ రఫీ, రవి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సత్తి, శంకరాచలం, కృష్ణారెడ్డి మహేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

=

## ఏనుగుల కదలికలపై అప్రమత్తం

- జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు



గుడిపాల, జనవరి 13 ప్రభాతవార్త:

ఏనుగుల సంచారం వున్న ప్రదేశాల్లో ప్రజలు నిత్యం అప్రమత్తంగా వుండాలని జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు అన్నారు. మండలంలోకి ఏనుగుల గుంపు ప్రవేశించి రైతుల పంట పొలాలపై దాడులు చేయడంతో సోమవారం రాత్రి డిఎఫ్ఓ శ్రీనివాసులు చిత్తపార బీట్‌కు సంబంధించి బట్టువాండ్లవూరు పరిసరాల్లో ఏనుగుల కదలికలను పరిశీలించి ఆ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రాత్రి సమయాల్లో రైతులు పంట పొలాల వద్దకు, అటవీ ప్రాంత సమీపానికి ఒక్కరిగా వెళ్ళకూడదన్నారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటారని, ప్రజలు భయబ్రాంతులకు గురి కాకుండా అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ పట్టాభి, డిఆర్ఓ కరణ్‌సింగ్, బీట్ ఆఫీసర్ కుసుమ, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతానికి అధికారులు సేవలు భేష్

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలో మూడురోజుల పాటు నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్-2026ను విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ధన్యవాదాలు తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు, ఆర్డీఓ కిరణ్మయితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేశారని తెలిపారు. అలాగే టూరిజం ఆర్‌డి రమణ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, డిఎస్‌ఓ హారికతో పాటు తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది శ్రమించడంతో ఈ విజయం సాధ్యమైందని విజయశ్రీ పేర్కొన్నారు.



దీనికితోడు కూటమి పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు ఈ విజయంలో భాగస్వాములయ్యారని తెలిపారు. అలాగే మీడియా పెద్దఎత్తున సహకారం అందించడం మంచి ప్రచారం చేయడంతో సందర్శకులు ఆశించిన దాని కన్నా ఎక్కువగా వచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, బొమ్మన్ శ్రీధర్, ఇతర పార్టీల నేతలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.


బఫర్ జోన్‌లో జోరుగా సాగుతున్న అక్రమ కట్టడాలు

## అక్రమ కట్టడాలను అడ్డుకున్న సిపిఐ నాయకులు

వెంకటగిరి, జనవరి 13, ప్రభాతవార్త
పట్టణంలోని కైవల్యా నది ఒడ్డున అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడను కట్టడాలను సిపిఐ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్, తాసిల్దార్లకు ఫిర్యాదు చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి చిన్నం పెంచలయ్య అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో బ్రిడ్జికి ఆనుకొని చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలనే విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. పాత ఎమ్మార్వో ఆఫీస్‌కి ఎంపీడీవో కార్యాలయం ప్రాంతంలో కైవల్యా నది ఒడ్డున బఫర్ జోను ఏరియాలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు జరుగుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో వెంకటగిరి భూ కబ్జాదారులకు నిలయంగా మారి పోతుందన్నారు. ఆ భూమి కోట్ల రూపాయలు విలువ గలిగిన ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని సిపిఐగా మీకు విన్నవించుకుంటున్నాము. ఈరోజు తక్షణమే అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్న పనులను తక్షణమే నిలిపి వేయడానికి చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతున్నాము. కాగా అధికారులు జోక్యం చేసుకొని తాత్కార్యంగా పనులను ఆపివేశారు. హ్యాండ్లూమ్ టెక్నాలజీ వద్ద ఉన్న స్థలాన్ని కూడా కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపిస్తే అక్కడ ఆక్రమించుకొని విక్రయిస్తున్నారు. అధికారులు నిమ్మక నేరేతునట్లు వ్యవహరిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

## అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా



సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త
సంక్రాంతి పండుగ సందర్భంగా సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు సీఐ మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. కోడిపందేలు, జూదం, గుండాట, మద్యం అక్రమ రవాణా వంటి అంశాలతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాల ద్వారా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలు సమాచారం అందజేయాలని కోరారు. 112 నంబర్‌కు ఫోన్ చేయాలని, సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచి, అసాంఘిక కార్యక్రమాలను అరికడతామని సీఐ మురళీకృష్ణ తెలిపారు.

## నెర్రికాలువలో గుర్తుతెలియని మృతదేహం



సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త
సూళ్లూరుపేట జాతీయ రహదారిపై గల గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న నెర్రి కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం పోలీసులు గుర్తించారు. మృతుని వయస్సు 30 నుంచి 40 సంవత్సరాలు ఉంటుంది. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే తక్షణమే పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ బ్రహ్మనాయుడు కోరారు. మృతుడు నల్లని జీన్స్ ప్యాంటు, గోధుమరంగు చొక్కా ధరించి ఉన్నాడు. ఎస్ఐ ఫోన్ నంబర్ 9440796361కు సమాచారం అందించాలని తెలిపారు.

## వాటర్ ప్లాంట్ స్థల పరిశీలన



వాకాడు, జనవరి 13, ప్రభాతవార్త
వాకాడు మండలం మొలగనూరు గ్రామంలోని వాటర్ ప్లాంట్ నిర్మాణంకు తహసిల్దార్ సయుద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయి ప్రసాద్‌లు స్థలాన్ని పరిశీలించారు. మొలగనూరు గ్రామంలోని త్రాగునీటి సమస్య ఉందని ప్రజాదర్బార్లో గ్రామస్తులు ఎమ్మెల్యేని వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని తెలియజేయడంతో ఎమ్మెల్యే స్పందించి అధికారులకు స్థల పరిశీలన చేయాలని సూచించడంతో స్థలం పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. వీఆర్వో శ్రీనివాసులు సిబ్బంది ఉన్నారు.

### పేట జనసేన కార్యాలయాన్ని

## సందర్శించిన మంత్రి కందుల దుర్గేష్

నాయుడుపేట, జనవరి 13, ప్రభాతవార్త



ఈ సంవత్సరం ఫ్లెమింగో ఫెస్టివల్‌కి మూడవ రోజు ముఖ్యఅతిథిగా సూళ్లూరుపేట నియోజకవర్గానికి విచ్చేసిన జనసేన పార్టీ నాయకులు, ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని నాయుడుపేటలోని జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యాలయాన్ని సందర్శించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఆహ్వానం మేరకు పార్టీ కార్యాలయానికి విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో మీటింగ్ హాలు, ఆఫీస్ ఛాంబర్‌ని చూసి, ఒక మంచి పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసినందుకు ఉయ్యాల ప్రవీణ్‌ని ప్రశంసించారు. జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటుకు సహకరించిన జనసేన సీనియర్ నాయకులు అట్లా కృష్ణారావుకి మంత్రి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని పార్టీ క్యాడర్‌కి మంత్రి సూచించారు. జనసేన పార్టీ కార్యాలయంలో త్వరలో జనసేన నాయకులు, జనసైనికులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకుంటామని మంత్రి తెలియజేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి పార్టీ కార్యాలయానికి విచ్చేసినందుకు మంత్రి కందులు దుర్గేష్‌కి ఉయ్యాల ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి రాకతో సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేన క్యాడర్లో నూతన ఉత్సాహం నెలకొనింది. మంత్రి వెంట శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు చైర్మన్ శ్రీ కొట్టె సాయి బోర్డు మెంబెర్ శ్రీ పగడాల మురళి తదితర జనసేన నాయకులు పార్టీ కార్యాలయంని సదర్శించారు. జనసేన సీనియర్ నాయకులు అట్ల కృష్ణ రావు, గిండి సతీష్, మల్లాం విజయ్, బాలు శెట్టి, సుమతి రావు, కుంపటి శ్రీను, జ్యోతీష్, రెడ్డి శ్రీనివాస్, తాటిపర్తి శోభన్, సుగున్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పథకంకు 100 శాతం నిధులు

## కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలి

### రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలి : ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి




నాయుడుపేట, జనవరి 13, ప్రభాతవార్త
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వమే నూరు శాతం నిధులు కేటాయించాలని నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి మాట్లాడారు. ఇప్పటివరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 100 రోజులు పని కల్పించే వారిని తెలిపారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అ జీవిక మిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాగా గతంలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంకు నూరు శాతం నిధులు కేటాయించేదని అన్నారు. ప్రస్తుతం 60 శాతం నిధులు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించేలా రూపొందించారని తెలిపారు. 125 రోజులు పని కల్పించేలా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ పథకానికి పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం నూరు శాతం నిధులు మంజూరు చేయాలని ఆమె అన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక పథకంలో పనులు కల్పించాలని కోరిన కూలీలకు డిమాండ్ నోటీసులు సిబ్బంది ఇచ్చేలా చూడాలన్నారు. రైతులు యూరియా కోసం వ్యవసాయాధికారి, తహసిల్దార్ కార్యాలయాల చుట్టూ రైతులు పనులు మానుకుని తిరుగుతు న్నారని అన్నారు. రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె. సురేష్ బాబు,తహసిల్దార్ ఎం రాజేంద్ర, పలువురు కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## పొదుపు మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ



వాకాడు, జనవరి 13, ప్రభాతవార్త
మండల పరిషత్ కార్యాలయం వెలుగు ఏపీఎం పోలమ్మ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు మంగళవారం ఎంపీడీవో సాయిప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ ల చేతుల మీదుగా పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో సాయిప్రసాద్ మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా పొదుపు మహిళలు జీవనోపాధి పెంపొందించుకోవాలని తెలిపారు. ఏపిఎమ్ పోలమ్మ మాట్లాడుతూ మండలంలోని పొదుపు గ్రూపులకు 100 యూనిట్లు పెరటి కోళ్లను సీసీలకు, వివో ఎల్రా ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు రమణమ్మ, సరోజనమ్మ, గున్నయ్య, రమణయ్య, వివోఏలు ఉన్నారు.

## మేరీ అనాధ వృద్ధాశ్రమంలో దుస్తులు, నిత్యవసరాలు పంపిణీ



నాయుడుపేట, జనవరి 13 ప్రభాతవార్త
నాయుడుపేట పట్టణంలోని మేరీ అనాధ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం నాయుడుపేట మున్సి పల్ మాజీ వైస్ చైర్మన్ అత్తి కాయల సుబ్రహ్మ ణ్యం తన తల్లిదండ్రులైన అత్తికాయల సుబ్బరా మయ్య, జ్ఞానమ్మల జ్ఞాపకార్థం దుస్తులు, నిత్య వసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లా డుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత 14 ఏళ్లుగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలియ జేశారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చిరువెళ్ళ ముని రాజా, గుంటూరు లక్ష్మయ్య, దగ్గోలు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

### వచ్చే ఏడాది ప్రతి గ్రామంలోనూ

## ముగ్గుల పోటీలు : ఎంఎల్ఏ సుధీర్



శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త
వచ్చే ఏడాది నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ముగ్గుల పోటీలు నిర్వహించి మన సంప్రదాయాలు, సంస్కృతికి పెద్దపీట వేస్తామని మంగళవారం శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి ఆవరణలో తెలుగుదేశం పార్టీ తరఫున ఏర్పాటు చేసిన రంగోలి పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన వచ్చింది. ఏర్పాట్లును మార్కెట్ కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మహిళలు ఆడుతూ పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. మహిళలు గొబ్బిపాటలు పడుతుంటే బొజ్జల బృందమ్మ వారితో జత కట్టారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మన సంప్రదాయాలు,సంస్కృతి మహోన్నతమైనదన్నారు. ఈ పోటీలు నిర్వహించుటకు తన సతీమణి రిషితారెడ్డి ఎంతో చొరవ చూపారని శ్రద్ధగా నిర్వహించారన్నారు. ఇక్కడ పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలే అని సుధీర్‌రెడ్డి అభినందించారు. వీరి ఉత్సాహం చూసిన తరువాత వచ్చే ఏడాది సంక్రాంతికి గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించుటకు నిర్ణయించినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు.

విజేతలకు బహుమతులు:

శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎంఎల్ఏ సుదీర్‌రెడ్డి నిర్వహించిన ముగ్గుల పోటీలకు వందల మంది హాజరయ్యారు. వీరిలో ఎన్నికైన వారికి బహుమతులను అందించారు. మొదటి బహుమతి ముగ్గు నెంబర్ 24 దీనిని వేసిన ఉడమలపాడు గ్రామానికి చెందిన దివ్యకు వాషింగ్ మిషన్‌ను అందించారు. రెండవ బహుమతి ముగ్గు నెంబర్ 5ను వేసిన శ్రీకాళహస్తి పట్టణంలోని గోపాలకృష్ణారెడ్డి కాలనీకి చెందిన సి.గాయత్రిని వరించింది. ఆమెకు 32ఇంచిల టివిని అందించారు. మూడవ బహుమతిని కాపుగునేరికి చెందిన శ్రీలేఖ ముగ్గు నెంబర్ 91కి దక్కింది. మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు.

## ఉత్సాహంగా...ఉల్లాసంగా ముందే సంక్రాంతి సంబరాలు

తిరుపతి,జనవరి 13ప్రభాతవార్త:



ఇస్కాన్ ఆలయం ఎదురుగా టీటీడీ గ్రౌండ్స్‌లో మంగళవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు ఉల్లాసంగా జరిగాయి.సంక్రాంతి పండుగ అందరికీ పెద్దపండుగ అని, దీన్ని సంతోషంగా జరపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గాలి పటాలు (పతంగులు) ఎగుం వేసి అందరూ ఆనందంగా పండుగ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సామంచి శ్రీనివాస్ ,,సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఆర్ సి మునికృష్ణ, గోపాల్ రెడ్డి,రుద్రకోటి సదాశివం ,కరాటే శీను, ప్రభాకర్ నాయుడు, రాజశేఖర్ రెడ్డి ,బాబు ,మల్లారపు వాసు, ఊక విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ తిరుపతి జిల్లా కార్యదర్శిగా బాణావరపు ఉమాపతి



తిరుపతి హెల్త్, జనవరి 13, ప్రభాతవార్త
విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర సమావేశం కర్నూల్ కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన సమావేశానికి తిరుపతి జిల్లా నుండి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ బాణావారపు ఉమాపతిని దక్షిణాంధ్ర ప్రాంత అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి బాణావారపు ఉమాపతిని తిరుపతి జిల్లా కార్యదర్శిగా నియమించడం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు దాసరి మురళమ్మ, దక్షిణాంధ్ర ప్రాంత కార్యదర్శి పరె కోటేశ్వరరావు, ఇతర ప్రాంత పదాధికారులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో ముగ్గుల పోటీలకు విశేష స్పందన

తిరుపతిరూరల్, జనవరి13 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. తుమ్మలగుంట గ్రామంతో పాటు పరిసర గ్రామాల మహిళలు పెద్దఎత్తున రంగవల్లికలలో పాల్గొని, సంక్రాంతి శోభను చాటారు. ఆలయం ముందు మహిళలు తమ ప్రతిభ పాటవాలను ముగ్గుల రూపంలో ప్రదర్శించి, తమలో దాగివున్న ప్రతిభను వెలికి తీశారు. ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సుబ్బిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అనుమానాస్పద మృతి



తిరుచానూరు, జనవరి 13 ప్రభాతవార్త :
తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలిని జయకుడి(45)గా పోలీసులు గుర్తించారు. వివాహేతర సంబంధం వల్లే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికులు నిందితుడు జయకుమార్ అనే వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈమె మృతి హత్యా...? ఆత్మహత్యా...? అన్నకోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు.

## ఐపిఎల్‌ను తలపించిన కెపిఎల్

### -హోరాహోరీ పోరులో పివిపి ఘన విజయం

రాజులూరు(చౌడేపల్లి), జనవరి 13 ప్రభాతవార్త



మూడు రోజులపాటు దాదేపల్లి వద్ద నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటు మంగళవారంతో ముగిసింది. చివరి రోజున ఎర్రపల్లి పివిపి, శెట్టిపేట ఎంకెవైఐ చితాస్ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. క్షత్రియ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ఐపిఎల్ క్రికెట్‌ను తలపించేలా ఆటగాళ్ళు రెచ్చిపోయారు. ఈ పోరులో ఎర్రపల్లి పివిపి విజయం సాధించి ట్రోఫీని ఎగరేసుకు పోయింది. అదే విధంగా మహిళల త్రోబాల్ విభాగంలో బెంగళూరు వనితలు గెలిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో క్షత్రియ పెద్దలు ప్రసంగిస్తూ క్షత్రియులు క్రీడల్లో రాణించాలన్నారు. యేటా సంక్రాంతి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ విద్యనభ్యసించి వేరొక చోట కొలువులు చేస్తున్న తమను సంక్రాంతి పండుగ కలిపిందని ఆనందం వ్యక్తం చేసారు. క్షత్రియ యువతీ, యువకులు సామాజిక సేవలో పాల్గొనాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. క్షత్రియ యువకులు ఆడిన క్రికెట్ టోర్నమెంటును స్థానికులు ఆసక్తిగా తిలకించారు. మొదటి బహుమతి ఎర్రపల్లి పివిపికి దివ్యశ్రీ డెవలపర్స్ ఎన్.భాస్కర్‌రాజు ట్రోఫీతోపాటు రూ. లక్ష, ద్వితీయ బహుమతిని శెట్టిపేట ఎంకెవైఐ చితాస్‌కు కొత్తవీరపల్లి ఎన్.పురుషోత్తమరాజు రూ. 75వేలు, తృతీయ బహుమతి రూ. 50వేలు తానాఇండ్లు థండర్స్‌కు ఎంఎస్ ఇన్‌ఫ్రా అధినేత ఎం.సుదర్శనరాజులందించారు. మహిళల త్రోబాల్ మొదటి బహుమతిగా రూ. 50వేలు లోకేశ్వర్‌రాజు, ద్వితీయ బహుమతి రూ. 30వేలు ఎర్రపల్లి కోసూరు రవిరాజులందించారు. అంతే కాకుండా ఆటలో ప్రతిభ కనబరచిన వారికి ప్రతిభా అవార్డులు, నగదు బహుమతులు, టివీలు, ల్యాబ్‌ట్యాబ్‌లు, ఆర్గనైజర్లకు మొబైల్ ఫోన్లందించారు. జయచంద్రరాజు, సునీల్‌రాజు, వై.శ్రీనివాసరాజు, ఎస్.పురుషోత్తమరాజు, ఎం.సుదర్శనరాజు, ఎన్.పురుషోత్తరాజు, అనిల్‌కేశ్యామరాజు, ఎస్.శ్రీనివాసరాజు, సుబ్రమణ్యం(మణి) వై.శ్రీనివాసరాజు, ఎస్.పురుషోత్తమరాజు, సుకుమార్‌రాజు, బాలకురపల్లి సుకుమార్‌రాజు, నవీన్‌కేశ్యామరాజు, శ్రీదర్‌రాజు(గిరి), వెంకటేష్‌రాజు, సుబ్రమణ్యంరాజు, మాదిరాజు పతిరాజు, భక్తవత్సలరాజు, నారాయణరాజు, చౌడేపల్లి, పుంగనూరు, బెంగళూరుకు చెందిన క్షత్రియ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

## సంకటహర గణపతి వ్రతంలో సమూల మార్పులు

### -ఇకపై మూడు దఫాలుగా వ్రతం నిర్వహణ

### -టిక్కెట్ ధర రూ.500లకు పెంపు: ఇద్దరికి అనుమతి

కాణిపాకం, జనవరి 13 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహించే సంకటహర గణపతివ్రతంలో సమూల మార్పులు తీసుకువస్తూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సంకటహర చతుర్థి-ప్రతి నెలా పౌర్ణమి తరువాత వచ్చే చవితి.సంకట అనగా 'కష్టములు' హర అనగా 'నశింపజేయునది' చతుర్థి అనగా '4వ తిథి' విఘ్నములకు అధిపతి అయిన గణపతికి ప్రీతికరమైన తిథి కావున ఆ పర్వదినమున విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం, వివాహం,ఆరోగ్యం, తదితర విషయములలో వున్నటు వంటి ఒడిదుడుకులను అధిగమించుటకు ఈసంకటహర చతుర్థి వ్రతమును పురాణములలో సూచించియున్నారు. అటువంటి వ్రతమును వినాయకుడే స్వయంభువుగా వెలసిన కాణిపాకం క్షేత్రంలో ప్రతి నెలా చతుర్థి రోజున నిర్వహిస్తుంటారు. ఈవ్రతంకు భక్తుల నుండి రోజురోజుకు అనూహ్య స్పందన లభిస్తోంది. దీనితో వ్రతం నిర్వహించుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వుంది. గత ఏడాది క్రితం వరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో నిర్వహించే ఈవ్రతంను పెరుగుతున్న రద్దీ దృష్ట్యా స్థానిక ఆస్తాన మండపంకు మార్పు చేశారు. ప్రస్తుతం చతుర్థి రోజున ఉదయం 10 గంటలకు,సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు రెండు దఫాలుగా సుమారు 900 మంది వరకు భక్తులు ప్రత్యక్షంగా వ్రతంలో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో ఈవ్రతం నిర్వహించుకునే వారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతుండడంతో ఆస్థాన మండపంలో కూడా స్థలం చాలడం లేదు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని ఆలయ అధికారులు వ్రతం నిర్వహణలో భారీ ఎత్తున మార్పులు తీసుకువచ్చారు. ఈమేరకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని వచ్చేనెల నుండి మూడు దఫాలుగా వ్రతం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 5 గంటలకు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే గతంలో వ్రతంలో ప్రత్యక్షంగా పాల్గొనే భక్తులకు ఇక్కొక్కరికి 350 రూపాయలుగా వున్న టిక్కెట్ ధరను 500 రూపాయలకు పెంచుతూ, వ్రతంకు ఇద్దరిని అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే ప్రస్తుతం వ్రతంను మోదుగ ఆకులో నిర్వహిస్తుండగా ఇకపై దాతల సహకారం తీసుకుని రాగి తట్టలో వ్రతంను నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వచ్చేనెల చతుర్థి రోజు నుండే ఈనిర్ణయాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈచర్యల వల్ల భక్తులకు సౌకర్యాంగా వుండడంతో పాటు దేవస్థానంకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం వుంది. ఈసందర్భంగా ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు 'ప్రభాత వార్త'తో మాట్లాడుతూ భక్తుల సౌకర్యాలను దృష్టిలో వుంచుకుని సంకటహర గణపతి వ్రతంలో మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈమార్పులు వచ్చేనెల నుండి అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా వుండగా వ్రతంలో వృద్దులు,వికలాంగులు కూడా పాల్గొంటుండడంతో వారి సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకుని శ్రీకాళహస్తి దేవస్థానం తరహాలో పీటలను ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు దేవస్థానం అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


,కాణిపాకంలో జరుగుతున్నర సంకటహర గణపతివ్రతం (ఫైల్‌ఫోటో)